సాక్షి
నిర్మల్
బుధవారం ॥ 4 ॥ సెప్టెంబర్ ॥ 2024



సరస్వతి కాలువకు గండి

లక్ష్మణచాంద మండలం రాచాపూర్ సమీపంలో సరస్వతి బ్రిడ్జి కాలువ తెగింది. వర్షపు నీరుతోపాటు పొలాల నుంచి నీరు వెళ్తుండడంతో కాలువ గట్టు పూర్తిగా కూలుతుంది. 8లో▸

గడ్డెన్నవాగు గేట్ల మూసివేత

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో అధికారులు గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు కాగా, మంగళవారం 6,805 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టులో ప్రస్తుతం 358.2 మీటర్ల నీరు నిల్వ ఉంది. రెండురోజులు మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లన్నీ మూసివేశారు.

గరిష్టం/కనిష్టం
29.5 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించారు. స్థానిక గండి రామన్న ఆలయ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం కలిసి పలు సూచనలు చేశారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా, వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోట్లు, లైఫ్ జాకెట్లు తదితర సామగ్రిని పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్డీఆర్‌ఎఫ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వుషూ పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన క్రీడాకారులు

భైంసాటౌన్: అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న మంచిర్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వుషూ పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. భైంసాలోని ఖేలో ఇండియా వుషూ శిక్షణ కేంద్రం నుంచి 10 మంది క్రీడాకారులు పాల్గొనగా, వీరిలో 3 బంగారు, 4 రజత, 2 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 26 వరకు, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్‌లో జరిగే 33వ సీనియర్ జాతీయస్థాయి వుషూ పోటీల్లో పాల్గొనున్నట్లు కోచ్ జ్ఞానతేజ తెలిపారు. ప్రతీక్ష, రాజశ్రీ, మృణాళిని, బంగారు పతకాలు సాధించగా, శివప్రసాద్, గజేందర్, జాదవ్ కిరణ్, సాయికిరణ్ రజతం, సాయికిరణ్, జ్ఞానతేజ కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు క్రీడాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు తేజేందర్ సింగ్ భాటియా, శ్రీకాంత్, భూషణ్, శ్రీరాముల సాయికృష్ణ, శివరాజ్‌గౌడ్, నితిన్ గౌడ్, లింగం, అనూష పాల్గొన్నారు.

దుర్గ పేరిట రూ.5 లక్షలు డిపాజిట్



దుర్గ పేరిట రూ.5 లక్షల నగదును పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ చేస్తున్న అధికారులు

తానూరు: బెల్‌తరోడా గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన 12 ఏళ్ల బాలిక దుర్గను ఆదుకునేందుకు పలువురు దాతలు ఆర్థికసాయం చేశారు. రూ.5 లక్షల విరాళాలు రాగా ఆ మొత్తాన్ని తహసీల్దార్ లింగమూర్తి, గ్రామస్తులు మంగళవారం పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మాజీ సర్పంచ్ గోప సాయినాథ్ చొరవతో రూ.5 లక్షలను పదేళ్లపాటు భైంసా పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు.

కడెం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

కడెం: ఎగువన కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. మంగళవారం ప్రాజెక్టుకు 30,279 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టు అధికారులు 3 వరద గేట్లను ఎత్తివేసి 17,461 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 694.450(6.233టీఎంసీ) అడుగులు ఉంది.



మంచి నీటి బావిని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

అప్పుచేసి.. ఆన్‌లైన్‌లో పెట్టి..

- 'కాయిన్' పెట్టుబడి కోసం ఆస్తులు తాకట్టు
- బంగారం, ప్లాట్లు, కార్లు అమ్ముకున్న 'మధ్యతరగతి'
- అత్యాశకు పోయి.. అవస్థలు పడుతూ..
- వెలుగులోకి వస్తున్న 'ఆన్‌లైన్' కథలు



నిర్మల్: జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యాపారి భార్య ఇద్దరు పిల్లలతో ఉన్నదాంట్లో సంతృప్తిగా బతుకుతున్నాడు. ఐదారునెలల కిందట ఆయనకు ఓ ఉద్యోగ మిత్రుడు కలిశాడు. 'అరె.. ఫలానా ఆన్‌లైన్ దందా బాగుందిరా. నేను పెట్టుబడి పెట్టిన. ఊహించని లాభాలు వస్తున్నాయి. నువ్వు కూడా పెట్టురా.. ఏం టెన్షన్ పడకు. ఏం కాదురా, అంతా నేను చూసుకుంటా..'అంటూ తన లాభాల లెక్కలను చూపడంతో సదరు వ్యాపారి మొదట్లో రూ.50 వేలు పెట్టాడు. కొన్నివారాలకు రూ.ఐదు లక్షలు పెడితే నెలకు రూ.లక్ష దాకా వస్తాయని చెప్పడంతో, కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులతో కొనుకున్న ప్లాటును అమ్మేసి మరీ పెట్టుబడి పెట్టేశాడు. తన వ్యాపారం మానేసి, ఆన్‌లైన్ దందాలో కూరుకుపోయాడు. ఇటీవల పోలీసులు కొంతమందిని అరెస్టు చేయడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. తను డబ్బులు కట్టిన దోస్తు ఫోన్ ఎత్తడం లేదు. మరోవైపు తాను డబ్బులు కట్టించినవారు గంటకోసారి ఫోన్ చేస్తున్నారు.

ఇలా.. ఈ ఒక్క వ్యక్తే కాదు, చాలామంది అత్యాశకు పోయి తమ శక్తికి మించి అప్పులు చేసి మరీ 'ఆన్‌లైన్' దందాల్లో పెట్టుబడులు పెట్టారు. కనీసం సదరు వ్యాపారాల గురించి ఆరా తీయకుండా రూ.లక్షల్లో పెట్టేశారు. తీరా.. వాటి గురించి ఇప్పుడిప్పుడు తెలుస్తుండటంతో 'అయ్యో.. ఇప్పుడెలా..!' అంటూ కుమిలిపోతున్నారు.

శక్తికి మించి డబ్బులు పెట్టి..

జిల్లాలో యూబిట్ తతంగం బయటకు వచ్చిన తర్వాత 'ఆన్‌లైన్' కథలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ దందాలో సగానికిపైగా ఉపాధ్యాయులు, ఉద్యోగులే ఉన్నప్పటికీ మిగిలిన వారందరూ సాదాసీదా కుటుంబాల వారే ఉన్నారు. ఇలాంటి కుటుంబాలు ఈ దందాలో తమ శక్తికి మించి పెట్టుబడులు పెట్టాయి. కాస్తోకూస్తో చైతన్యవంతమైన ప్రాంతంగా పేరున్న ఖానాపూర్, కడెం ఏరియాలో మరీ దారుణం. ఇక్కడ చిన్నపాటి కిరాణా దుకాణం నడిపేవాళ్లూ అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

మధ్యతరగతి కుటుంబాలే..

పేరేదైనా ఆన్‌లైన్ చైన్‌దందాలన్నీ ఒకేలా పనిచేస్తున్నాయి. మొదట్లో ఆకాశానికెత్తే లాభాలు చూపుతాయి. మెల్లగా గొలుసుదందాలో ఇరికిస్తాయి. ఇక 'నువ్వు కూడా ఓ పదిమందిని చేస్తేనే నీకు లాభాలు వస్తాయి..'అనే పరిస్థితికి తీసుకువస్తాయి. అధిక లాభాలు వస్తాయన్న అత్యాశతో రూ.లక్షల్లో పెట్టిన పెట్టుబడితోపాటు ఎంతోకొంత లాభాలను పొందాలని ఆ దందాల్లో కూరుకుపోతున్నారు. తాజాగా జిల్లాలో బయటపడిన యూబిట్ బిజినెస్‌లో ఇలా ఇరుక్కుపోయిన వాళ్లే ఎక్కువగా ఉన్నారు. ఇందులోనూ అధికశాతం మధ్యతరగతి కుటుంబాలవారే. గతంలోనూ చాలా ఆన్‌లైన్ దందాలు ఎన్నో కుటుంబాలను రోడ్డుపాలు చేశాయి. ఇటీవల మంచిర్యాలకు చెందిన ఓ కుటుంబం హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడానికీ ఇలాంటివే కారణం.

వాళ్లను చూసే..

ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అధికారులే నేరుగా యూబిట్ దందాలో ఉండటమే జిల్లాలో వేగంగా విస్తరించడానికి కారణం. ఈ దందాను ముందుగా జిల్లాకు తీసుకువచ్చింది కడెంవాసి కావడంతో ఖానాపూర్ ప్రాంతంలో ఎక్కువగా విస్తరించింది. గతంలో చాలా ఆన్‌లైన్ దందాలు నిర్వాహకులు చేసినట్లే.. ఇందులోనూ సమాజంలో కొంత పేరుండి, వాళ్లు చెబితే పదిమంది వింటారు.. అనేవాళ్లనే ఎంచుకున్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రెటరీలు, పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగులు, అధికారులు, వైద్యులు ఇలా.. కొన్ని ప్రభావిత వర్గాలను ఎంచుకుని వారిపైనే పూర్తిగా ఫోకస్‌పెట్టి మరీ చేర్చుకున్నారు. ఇక.. ఈ వర్గాలవారూ అత్యాశకు గురై ఈ దందాలోకి రావడంతో వీరిని నమ్మి మిగిలిన వారంతా చేరుతూ వచ్చారు.

ఇబ్బందులు పడొద్దు..



వెనుకాముందు తెలుసుకోకుండా ఆన్‌లైన్ సంస్థలు/యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు. ఎవరు కూడా ఊరకే రూ.లక్షల్లో లాభాలను ఇవ్వరన్న విషయాన్ని గ్రహించాలి. చైన్‌లింక్ దందాల్లో చాలామంది అమాయకులే బలవుతున్నారు. ఇప్పటికైనా మేల్కొవాలి. ఇక ముందు ఎవరూ ఇబ్బందులు పడొద్దు.

–జానకీషర్మిల, ఎస్పీ

ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలి



సంచార పుస్తక వాహనం ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ విద్యార్థి పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సమీ కృత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార పుస్తక వాహనాన్ని మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. సంచార వాహనంలో చదవడానికి అందుబాటులో ఉంచిన పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల సాహిత్య పుస్తకాలతో విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తి పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వాహ నం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తుందన్నారు. విద్యార్థుల పుస్తక పఠన సామర్థ్యం పెంచడానికి కృషి చేస్తున్న రూమ్ టూ రీడ్ సంస్థను కలెక్టర్ అభినందించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, డీఈవో రవీందర్‌రెడ్డి, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌చార్జి రవి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, సాధారణ వత్తి నైపుణ్య కోర్సులు చదువుచున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2024–25 విద్య సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివద్ధి శాఖ అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 1 నుంచి అక్టోబర్ 31 వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు www.telanganaepass వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముంపు భయం తొలగేలా చర్యలు



కాలనీ సమస్యలు మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే



కాలనీవాసులతో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కాలనీలో పర్యటన
- ముంపు ఫొటోలను పరిశీలించిన మంత్రి
- సమస్యలు తెలిపిన స్థానికులు

నిర్మల్‌చైన్‌గేట్: భారీ వర్షాలు, వరదలతో ఏటా వణుకుతున్న నిర్మల్ పట్టణంలోని జీఎస్‌ఆర్ కాలనీ వాసుల ముంపు భయం తొగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని జీఎస్‌ఆర్ కాలనీని స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిలతో కలిసి మంగళవారం పరిశీలించారు. వరదల కారణంగా ఏటా కాలనీ ప్రజలు పడుతున్న కష్టాలు, నష్టాలు, సమస్యలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. వరదతో పడుతున్న ఇబ్బందులను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్వర్ణ ప్రాజెక్టు కింద చెక్ డ్యామ్ నిర్మాణం, స్థానికంగా ఉన్న నాలాల ఆక్రమణ కారణంగా వరద నీరు కాలనీని ముంచెత్తుతుందని తెలిపారు. చెక్ డ్యామ్‌తో ఏటా పొలాల్లోకి వరద నీరు చేరడంతో నిర్మల్ సమీప గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. చెక్ డ్యామ్ నిర్మాణాన్ని కుదించి, నాలా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి తద్వారా వరద నీటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోనికి సరైన రోడ్డు లేక వర్షాలు కురిసినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు వరదలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అండగా ఉంటాం..

అధైర్యపడవద్దని, ప్రభుత్వం ప్రజలకు, రైతులకు అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. కాలనీవాసుల సమస్యలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి సాంకేతిక నిపుణులతో చర్చించి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, రైతుల సహకారం అవసరమన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భారీ వర్షాల హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా కాలనీ ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.

మంత్రి పర్యటనకు బందోబస్తు



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్

నిర్మల్‌టౌన్: జీఎస్‌ఆర్ కాలనీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన నేపథ్యంలో ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. భైంసా ఏఎస్పీ అవినాష్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, రామకష్ణ, బందోబస్తును పర్యవేక్షించారు.

ప్రభుత్వానికి సహకరిస్తాం..

అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి జీఎస్‌ఆర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. కొన్నేళ్లుగా వర్షాకాలం వరదల వలన కాలనీవాసులు, నిర్మల్ చుట్టుపక్కల రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వరద సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు. కాలనీ వాసులు, రైతుల సమస్యల పరిష్కారానికి తాము అన్ని విధాలుగా ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, డీఎసీప గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఉగ్ర గోదావరి



ఉప్పొంగుతున్న బాసర గోదావరి

భైంసా/బాసర/లక్ష్మణచాంద: మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలత గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం నుంచి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి దిగువనకు బాసర మీదుగా శ్రీరామ్సాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. ఉగ్ర గోదావరిని చూసేందుకు ప్రజలు వంతెనపైకి చేరుకున్నారు. సెల్‌ఫోన్లలో ఉగ్ర గోదావరి దృశ్యాలను బంధించారు. ఉన్నతాధికారులు గోదావరి నది పరీవాహక ప్రాంతంతోపాటు లోతట్టు ప్రాంతాల లోనికి ఎవరు వెళ్లకూడదని హెచ్చరించారు. గంగా హారతి నిర్వహించే పుష్కర ఘాట్ వద్ద శివలింగాలు నీటిలో మునిగిపోయాయి. బాసర ఎస్సై గణేశ్, ఆలయ అధికారులు గోదావరి నది వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. లక్ష్మణచాంద మండలంలోని గోదావరి పరీవాహక గ్రామాలైన పీచర, ధర్మారం, పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద గ్రామాల వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

సదర్మాట్‌కు పోటెత్తిన వరద



సదర్మాట్ వద్ద భారీగా చేరుతున్న వరదనీరు

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు వరద నీరు భారీగా పోటెత్తింది. ఎగువన గల ఎస్సారెస్పీ 40 గేట్లు ఎత్తడంతో దిగువకు భారీగా నీరు వస్తోంది. దీంతో ఒక్కసారిగా గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దీంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఆయా గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు తదితరులు గోదావరి వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. సదర్మాట్ ఆనకట్ట వద్ద గరిష్ట నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 11.7 ఫీట్లుగా వరద కొనసాగుతోంది. దీంతో 77,748 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వెంకూర్ శివారులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్

కుంటాల: మూడు రోజుల్లో కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పత్తి, సోయా, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. కుంటాల మండలం ఓలా, వెంకూర్, అందాకూర్, దౌనెల్లి తాండ, కల్లూరు,లింబా(కె), లింబా(బి), పెంచికల్‌పాడ్ గ్రామాల్లోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో వరద చేలను ముంచెత్తింది. వెంకూర్ శివారులో దెబ్బతిన్న పంటలను డీఏవో అంజిప్రసాద్ మంగళవారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మాయన వెంట ఏఈవో గణేశ్, రైతులు ఉన్నారు.

అలుగుకు మరమ్మతు చేయించాలని వినతి..

వెంకూర్ చెరువు అలుగుకు మరమ్మతులు చేయించాలని రైతులు డీఏవో అంజిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో వరద నీటితో ఆయకట్టు కింద ఉన్న భూముల్లో ఇసుక మేటలు వేసిందని పేర్కొన్నారు. దీంతో పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. వినతి పత్రంలో కోరారు. చెరువు నీరంతా వృథాగా పోవడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందడం లేదని వెల్లడించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఏవో రైతులకు తెలిపారు.

మంత్రి దృష్టికి 'ముధోల్' సమస్యలు



మంత్రితో మాట్లాడుతున్న పటేల్, ఏలేటి

నిర్మల్: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ పలు సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించాలని కోరారు. స్థానిక ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. నిర్మల్, ముధోల్ రెండు నియోజకవర్గాల్లో నిధులు లేక నిలిచిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టులోని 27, 28ప్యాకేజీలను పూర్తిచేయాలని కోరారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ బాసర ఆలయానికి ఇచ్చిన రూ.42 కోట్లను ప్రస్తుత ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, వాటిని తిరిగి ఆలయానికే కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. భైంసా సమీపంలో పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపు గ్రామమైన గుండెగాంకు పనులు పూర్తిచేసేలా చూడాలన్నారు. ఏళ్లుగా పరిష్కారం కాని బాసర ట్రిపుల్‌ఐటీ సమస్యలపైనా దృష్టిసారించాలని పటేల్ కోరారు. ఈమేరకు సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే బాసర ట్రిపుల్‌ఐటీకి వస్తానని చెప్పారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ తరలించాలని మంత్రికి వినతి

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని నిలిపి వేసి వేరే ప్రాంతానికి తరలించాలని జేఏసీ నాయకులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మంగళవారం విన్నవించారు. పచ్చని పంటచేలు, గ్రామాల సమీపంలో ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే తమ భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక జేఏసీ సభ్యులు దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు, యువకులు ఉన్నారు.

పత్తి, పసుపులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతునేస్తం కార్యక్రమంలో డీఏవో అంజిప్రసాద్

కుంటాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, పసుపు పంటలలో నీరు నిల్వకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డీఏవో సూచించారు. కుంటాల రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా పలు సూచనలు చేశారు. చేలల్లో పంట కాలువలు తీసుకుంటే నీరు నిలవదని తెలిపారు. అధికారుల సూచన మేరకే మందులు వాడాలని కోరారు. కార్యక్రమంలో డీఏవో అంజిప్రసాద్, ఏడీఏ వీణ, ఏవో ఆసం రవి, ఏఈవోలు గణేశ్, శ్రీనివాస్, హర్షిత, పవన్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. డ్రైడే సందర్భంగా మండలంలోని భూత్కూర్, మున్యాల గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. వైద్య సిబ్బంది గ్రామీణులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర పరీక్షలు చేయాలని సూచించారు. అనుమానితులను ఆస్పత్రులకు తరలించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళలచే శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లోని మంచినీటి బావులను పరిశీలించారు. స్వచ్ఛదనం -పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఏపీఓం గంగన్న, ఏపీవో రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అనిల్, రంజిత్ ఐకేపీ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాదికి 'వల్లభాయ్ పటేల్' పురస్కారం



పురస్కారంతో న్యాయవాది సుధీర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి పురస్కారాన్ని పట్టణానికి చెందిన న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రముఖ సంఖ్య శాస్త్రవేత్త దైవాజ్ఞ శర్మ, బీసీ కమిషనర్ వకులాభరణం కృష్ణ, సత్య సంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఓంకార్ రాజ్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఆర్జీయూకేటీలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న అధికారులు

బాసర: ఆర్జీయూకేటీలో విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ సైబర్ సెక్యూరిటీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా క్లౌడ్ కంప్యూటింగ్ గురించి ఉపన్యాసకుడు శ్రీకాంత్ వివరించారు. డౌన్‌లోడ్ చేసుకున్న పాటలు, వీడియోలు డాక్యుమెంట్స్ కంప్యూటర్లలో స్పేస్ సరిపోకపోతే క్లౌడ్‌లో తీసుకోవచ్చునని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ల్యాప్‌టాప్, ఫోన్లలో అనుమానితులు పంపే ఈమెయిల్ లింక్‌లు క్లిక్ చేయొద్దన్నారు. అనంతరం ఉపన్యాసకుడిని సన్మానించారు. సమన్వయకర్త కిరణ్ కుమార్, పవన్, చీఫ్ వార్డెన్ ఆకుల శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా దొడర్నా చెరువు కట్ట



చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

కుభీర్: మండలంలోని దొడర్నా చెరువు కట్ట ప్రమాదకరంగా మారింది. అధికారులు రూ.6 లక్షల నిధులతో కట్టపై అక్కడక్కడ మొర్రంతో తూతూమంత్రంగా పనులు చేపట్టారు. ప్రస్తుతం కట్ట ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తులు అధికారులకు ఫోన్ ద్వారా వివరించారు. మంగళవారం తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్‌లు చెరువు కట్టను పరిశీలించారు. కాగా, ప్రస్తుతం తూము గేట్లు తెరిపించామని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై ఏఈ రమేశ్‌ను వివరణ కోరగా, మరమ్మతు జరిగాయి కావాలంటే ఫొటోలు ఇస్తాను ఫ్రంట్ పేజీలో వేసుకోండని దురుసుగా సమాధానమిచ్చారు.

'గిరి' పల్లెలో మృగాడు

- ఆదివాసీ మహిళపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి యత్నం
- ప్రతిఘటించడంతో తీవ్రంగా కొట్టిన నిందితుడు
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- గాంధీ ఆస్పత్రిలో కోలుకుంటూ వాంగ్మూలం ఇచ్చిన బాధితురాలు
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన



జైనూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం దేవుగూడ గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ(గోండు) మహిళపై అత్యాచార యత్నం, హత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఘటనలో బాధితురాలు తీవ్రంగా గాయపడింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లుగా కుటుంబ సభ్యులు భావించి ఈ నెల 1న సిర్పూర్(యూ) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖంపై తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఆదివారం రాత్రి సిర్పూర్(యూ) పోలీసులకు వివరాలు తెలియజేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం దేవుగూడకు చెందిన మహిళ(45) మక్కపిండి పట్టించడం కోసం గత శనివారం జైనూర్‌కు వచ్చింది. అదేరోజు పొలాల అమావాస్య కావడంతో సోయంగూడలో నివసిస్తున్న తన తల్లి ఇంటికెళ్లి రాఖీ కట్టేందుకు బయలుదేరాలని నిర్ణయించుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అటుగా వెళ్తున్న సోనుపటేల్‌గూడకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ మగ్దూం ఆమెతో మాటలు కలిపాడు. తనూ అటే వెళ్తున్నా అంటూ ఆమెను ఆటో ఎక్కాలని సూచించాడు. మొదట తటపటాయించిన మహిళ అతని మాయ మాటలు నమ్మి ఆటో ఎక్కింది. ఆ సమయంలో ఆటోలో మరెవరూ లేరు. రాఘవాపూర్ గ్రామం దాటి అటవీ ప్రాంతానికి చేరుకోగానే ఆటోడ్రైవర్ ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడమే కాకుండా తీవ్రంగా ప్రతిఘటించడంతో ఆగ్రహంతో ఆటోడ్రైవర్ షేక్ మగ్దూం కర్రతో తీవ్రంగా ముఖంపై దాడి చేశాడు. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం..

కర్రతో తీవ్రంగా కొట్టడంతో ఆదివాసీ మహిళ స్పృహ తప్పిపడిపోగా.. ఆమె చనిపోయిందని భావించిన ఆటోడ్రైవర్ మగ్దూం ఆ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఘటనాస్థలి నుంచి తీసుకొచ్చి ఆమెను రోడ్డుపై పడేసి అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితురాలు రోడ్డుపై పడి ఉన్న సమయంలో అటుగా ఓ వాహనం వెళ్లినట్లు గుర్తించిన స్థానికులు ఆమెను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిందని భావించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని వెంటనే జైనూర్ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌కు అటు నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. మరుసటి రోజు ఆదివారం ఆమె సోదరుడు సిర్పూరు(యూ) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైతం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లుగా కేసు నమోదు చేశారు.

బాధితురాలి వాంగ్మూలంతో..

ముఖం, పెదాలపై తీవ్రగాయాలు అవడంతో బాధితురాలు రెండు రోజులపాటు మాట్లాడలేకపోయింది. సోమవారం కొంత కోలుకోగానే కుటుంబసభ్యులు సిర్పూరు(యూ) పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాంగ్మూలం రికార్డు చేసేందుకు వెళ్లిన పోలీసులకు బాధితురాలు పెదాలకు కుట్లు పడినా బాధను దిగమింగుకుని ఆటోడ్రైవర్ అఘాయిత్యాన్ని వివరించింది. దీంతో కేసు మలుపు తిరిగింది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో అత్యాచార యత్నం, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద సిర్పూర్(యూ) పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం జైనూర్‌లో ఆటోడ్రైవర్ షేక్ మగ్దూంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సమక్షంలో నిందితుడు నేరం అంగీకరించినట్లు తెలిసింది. వెంటనే నిందితుడిని సిర్పూరు(యూ) పోలీసులు ఆసిఫాబాద్‌కు తరలించారు.

నిందితుడిని ఉరి తీయాలి

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించి, ఆపై హత్య చేయాలని ఉద్దేశంతో తీవ్రంగా గాయపర్చిన వ్యక్తిని వెంటనే ఉరి తీయాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ్‌రావు డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మగ్దూం అనే ఆటోడ్రైవర్ ఆదివాసీ మహిళను తీవ్రంగా గాయపర్చాడని తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న సీఐ రమేశ్, ఎస్సై సాగర్ ఘటనాస్థలికి చేరుకున్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు చాహకటి గణేశ్, రవీందర్, శేకు పాల్గొన్నారు.

నేడు జైనూర్ బంద్‌కు పిలుపు

ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం జైనూర్ మండల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

కర్ర ట్రాక్టర్





ఇన్‌సెట్ లో గుండోల్ల రాజు

కర్రతో చేసిన కళాఖండాలు అద్భుతంగా ఉంటాయి. నిర్మల్ కొయ్య బొమ్మలకు ప్రతీక. కర్ర దొరకకపోవడంతో ప్రస్తుతం కొయ్యబొమ్మల తయారీ తగ్గింది. ఇదిలా ఉంటే.. సర్సాపూర్ (జి)మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వడ్రంగి గుండోల్ల రాజు కర్రతో బుల్లి ట్రాక్టర్‌ను కళాత్మకంగా రూపొందించాడు. నిజంగా ట్రాక్టర్‌కు ఉన్నట్లుగానే చక్రాలు, ఇంజన్, ముందు భాగం, వాహన చోదకుడి సీటు, పొగ గొట్టం ఉన్నాయి. అద్భుతంగా తీర్చిదిద్దిన కళాఖండాన్ని చూసిన పలువురు వడ్రంగి రాజు ప్రతిభను అభినందిస్తున్నారు. - సర్సాపూర్ (జి)

యువతిని కాపాడిన పోలీసులు

నిర్మల్‌రూరల్: బావిలో పడి ఆత్మహత్యకు యత్నించిన యువతిని పోలీసులు కాపాడారు. రూరల్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన యువతి సునీత కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకునేందుకు మంగళవారం ఆ కాలనీలోని బావి వద్దకు వెళ్లింది. స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుళ్లు రవిశంకర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఆమెను కాపాడారు. సునీతకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదగాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

- ఎస్పీ గౌస్ ఆలం
- సెక్యూరిటీ గార్డుల జాబ్‌మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగంలో చేరిన వారు అంచెలంచెలుగా ఎదగాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లాకేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఆదిలాబాద్ సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సెక్యూరిటీగార్డుల జాబ్‌మేళాకు స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జీఎంఆర్, రక్షా సంస్థ సహకారంతో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి సెక్యూరిటీగార్డు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకనెల శిక్షణ తీసుకుని ఎయిర్‌పోర్టు, షిప్పింగ్ యార్డుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మేళాలో 500 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్‌రావు, ఫణిందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి కాలువకు గండి



తెగిన బ్రిడ్జి కాలువ

లక్ష్మణచాంద: అన్ని గ్రామాల్లో గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. ఒకటి నిండిన తర్వాత మరో చెరువులోకి నీరు వెళ్లే అవకాశం ఉంది. రాచాపూర్ వద్ద సరస్వతి కాలువపై ఉన్న చెరువు నీటితో నిండాక మరో రెండు చెరువులు నింపడానికి చిన్న చిన్న బ్రిడ్జి కాలువలు ఉన్నాయి. ఇందులో రాచాపూర్ సమీపంలో సరస్వతి బ్రిడ్జి కాలువ తెగింది. వర్షపు నీరుతోపాటు పొలాల నుంచి నీరు వెళ్తుండడంతో కాలువ గట్టు పూర్తిగా కూలుతుంది. ఓ వైపు సరస్వతి కాలువకు గండి పడటంతోపాటు చెరువులోకి నీళ్లు రావడం లేదని రైతులు అంటున్నారు. ఇదే సమయంలో కాలువ పక్క నుంచి వడ్యాల్ నుంచి రాచాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే 33 కేవీ లైన్ ఉంది. ఇందులో ఒక స్తంభం పక్కన గల మట్టి పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గండి పడుతున్న దృశ్యం

వామ్మో వానరాలు





కిసాన్‌గల్లీలో ఇంటి వద్ద చేరిన కోతుల గుంపు

భైంసాటౌన్: పట్టణంలో కోతుల బెడద వేధిస్తోంది. ఓ వైపు వీధి కుక్కలు వెంటబడి గాయపరుస్తుంటే, మరోవైపు కోతులు ఇళ్లలోకి చేరి భయాందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం కిసాన్‌గల్లీలో వానర దండు ఓ ఇంటిని చుట్టుముట్టింది. మహిళ ఇంట్లోకి వెళ్తుండగా, ఒక్కసారిగా కోతులు ఆమెను చుట్టు ముట్టడంతో భయాందోళనకు గురైంది. ఈ ఘటనలో ఆమె కాలి వద్ద చిన్నపాటి గాయమైంది. కాలనీలో చిన్నపిల్లలు ఉండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ, మున్సిపల్ అధికారులు కోతుల బెడద తీర్చాలని కోరుతున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



పోశెట్టి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

తానూరు: కిడ్నీ వ్యాధినయం కావడం లేదని మనస్తాపంతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భానుప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని భోసి గ్రామానికి చెందిన ఉమ్మడి పోశెట్టి (45).. 2021 నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్, భైంసా, నాందేడ్‌కు వెళ్లి చికిత్స తీసుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పురుగుల మందు తాగాడు. ఉదయం చూసేసరికి మృతిచెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉంది.

కుటుంబ కలహాలతో వ్యక్తి..



శివానంద్ మృతదేహం

గుడిహత్నూర్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రకు చెందిన కదం శివానంద్(28)కు గుడిహత్నూర్ మండలం మన్నూర్‌లోని సాయినగర్‌కు చెందిన వర్షతో గత పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా సాయినగర్‌లో ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో అత్తమామలతోపాటు భార్య తరపు బంధువులు ఆయన్ను వేధించసాగారు. భరించలేక సూసైడ్ నోట్ రాసి మంగళవారం తెల్లవారు జాము తన ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: లైంగికదాడికి యత్నించిన ఒకరికి మూడు నెలల సాధారణ జైలుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నిర్మల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు.కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ కథనం ప్రకారం..2018 ఏప్రిల్ 3న దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లింది. ఆ సమయంలో శ్రీను లైంగికదాడికి యత్నించగా, వెంటనే తప్పించుకుని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై హరిబాబు కేసు దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ ఆరుగురు సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. నిర్మల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారు.

గోదావరికి శాంతిపూజ



గోదారమ్మకు హారతి ఇస్తున్న ఆలయ అర్చకులు

బాసర: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరినది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. మంగళవారం గంట గంటకు నదిలో వరద ప్రవాహం పెరిగింది. ఎగువన మహారాష్ట్రతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో శ్రీజ్ఞాన సరస్వతి ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో గోదారమ్మకు అర్చకులు, అధికారులు, భక్తులు శాంతి పూజలు చేశారు. ఒడిబియ్యం చీర, సారె సమర్పించారు. హారతి ఇచ్చారు.

గోదావరి హారతి

గోదావరికి మంగళవారం వేకువజామున శ్రీవేద విద్యానందగిరిస్వామి ఆధ్వర్యంలో వేద ఋషి కుమారులతో హారతి, గుగ్గిల ధూప దీప నైవేద్య హారతి, సనాతన వేద భారతి పీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. విశేష పూజలో భక్తులు పాల్గొన్నారు.



గోదారమ్మకు హారతి ఇస్తున్న వేద పాఠశాల పిల్లలు

తహసీల్దార్లకు పోస్టింగ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లు తహసీల్దార్లుగా పదోన్నతి పొందగా ఆయా జిల్లాల్లో పోస్టింగ్ కేటాయిస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పదోన్నతులు పొందిన వారికి మల్టీ జోన్ పరిధిలో ఖాళీల ప్రకా రం జిల్లాలకు కేటాయించారు. ముగ్గురు మంచి ర్యాల, నిర్మల్ జిల్లా నుంచి ఒకరిని ఆదిలాబాద్‌కు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఒకరిని ఆదిలాబాద్‌కు, మరొకరికి జగిత్యాల జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఇక పెద్దపల్లి జిల్లా నుంచి ముగ్గురిని, జగిత్యాల జిల్లా నుంచి ఒకరిని ఆసిఫాబాద్ జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. ఒకరిని మంచిర్యాల జిల్లాకు ఇచ్చారు. వీరికి ఖాళీల ప్రకారం మండలాల్లో విధుల్లో చేరనున్నారు.

స్తంభాలపై విరిగిపడ్డ చెట్లు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్-ఖానాపూర్ మార్గంలో 11 కేవీ ఏజీఎల్ ఫీడర్‌పై మంగళవారం భారీ వృక్షం విరిగిపడింది. దీంతో వైర్లు తెగిపోవడంతో పాటు పలు స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.





